సాక్షి
ఖమ్మం
ఆదివారం । 16 । మార్చి । 2025



పర్యాటక 'వెలుగు'లు!

ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో కల్పిస్తున్న సౌకర్యాలతో ఇక్కడకు వస్తున్న పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం సా॥) 6.25

సహర్ (సోమవారం ఉ॥) 4.59

వాతావరణం

గరిష్టం / కనిష్టం 40° / 20°

జిల్లాలో ఆదివారం మధ్యాహ్న ఉష్ణోగ్రత గరిష్టస్థాయిలో ఉంటుంది. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

పైచేయి.. పంచాయితీ

అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరుతున్నాయి. పలుచోట్ల ఆధిపత్య పోరుతో విభేదాలు ముదరగా.. ప్రధానంగా ఖమ్మం నియోజకవర్గంలో కార్పొరేటర్లు, నేతల మధ్య వైరం పెరిగి ఎవరికి వారు తమదే పైచేయి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పాత, కొత్త నేతలు పెత్తనం కోసం వర్గాలుగా విడిపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈనెల 12న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఓ కార్పొరేటర్, మరో నేత మధ్య 'నువ్వెంత.. అంటే నువ్వెంత' అనే స్థాయిలో మాటల యుద్ధం జరగడం గమనార్హం. మంత్రి సమావేశంలో ఉంటే మాటెత్తని నేతలు.. ఆయన పరోక్షంలో జరిగే సమావేశాల్లో మాత్రం పెత్తనం కోసం ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



కాంగ్రెస్‌లో పెరుగుతున్న అంతర్గత పోరు

- పాత, కొత్త నేతల మధ్య పొసగని వైనం
- అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న కొందరు నేతలు
- ఖమ్మం నియోజకవర్గంలో ముదిరిన విభేదాలు

ఎవరి దారి వారిదే..

జిల్లాలో చాలాచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య పొసగడం లేదు. పార్టీలో మొదటి నుంచీ వర్గ పోరు ముఖ్య నేతలకు తలనొప్పిగా మారగా.. అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. ఖమ్మం నియోజకవర్గంలో అయితే నేతలు తలోదారి అన్నట్లు వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండడం.. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు, ఎంపీ, రాజ్యసభ సభ్యులు ఉండటంతో కిందిస్థాయి నేతలు వర్గాలుగా విడిపోయారని చెబుతున్నారు. నేతలు ఏ కార్యక్రమం నిర్వహించినా ఎక్కడో అక్కడ అసంతృప్తి బయటపడుతుండడం.. మంత్రులు, ఎంపీలు హాజరయ్యే కార్యక్రమాల్లో వారి వారి అనుచరగణం హడావుడి సర్వసాధారణమైంది.

నేతలు ఎక్కువవడంతో...

ఖమ్మం నియోజకవర్గంలో నేతల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆధిపత్య పోరు నానాటికీ అధికమవుతోంది. జిల్లాకు చెందిన పలువురు నేతలే కాక ఈ నియోజకవర్గానికి చెందిన ఇంకొందరు జిల్లా కేంద్రంగా ఉండే నామినేటెడ్ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగానే అంతర్గత పోరు నెలకొంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేయాలని నాయకత్వం సూచిస్తుండగా.. ఇక్కడి నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటుండడం గమనార్హం. ద్వితీయ శ్రేణి నేతలు కొందరు జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలను నేరుగా కలుస్తూ వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకోవడమే పనిగా పెట్టుకున్నారని చెబుతున్నారు.

పార్టీ కార్యకలాపాలపై ప్రభావం

ఖమ్మం నియోజకవర్గంలో నెలకొన్న విభేదాల ప్రభావం పార్టీ కార్యకలాపాలపై పడుతోందని నాయకత్వం భావిస్తోంది. సమావేశాలు, సభలకు నేతలు, కార్యకర్తలంతా హాజరయ్యే పరిస్థితి ఉండడం లేదు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సైతం జన సమీకరణపై ఎవరికి వారు అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈనెల 12న ఖమ్మం 10వ డివిజన్‌లో యూజీడీ శంకుస్థాపనకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకాగా.. వెయ్యి మందికి పైగా జనం పాల్గొంటారని అంచనా వేశారు. కానీ సభా ప్రాంగణంలో వందల్లో కూడా ప్రజలు లేకపోవడంతో కార్పొరేటర్లు, నేతలకు మంత్రి తుమ్మల సుతిమెత్తగా చురకలు అంటించినట్లు సమాచారం. అయితే, ఇప్పటికే పరిస్థితి 'చేయి' దాటకున్నా దీనికి అడ్డుకట్ట వేసేలా మంత్రి తుమ్మల కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

కలవని పాత - కొత్త నీరు

ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచిన కార్పొరేటర్లకు.. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లకు మధ్య విభేదాలు నెలకొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కొందరు, విజయం సాధించాక ఇంకొందరు కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు మేయర్ పునుకొల్లు నీరజ కూడా హస్తం గూటికి వచ్చారు. అయితే కాంగ్రెస్ అధికారంలో ఉన్నా గతంలో మాదిరి బీఆర్‌ఎస్ నుంచి చేరిన కార్పొరేటర్లదే హవా నడుస్తోందన్న భావన కాంగ్రెస్ తరఫున గెలుపొందిన కార్పొరేటర్లలో ఉంది. ఇదే సమయాన పార్టీ మారిన తమ ప్రాబల్యంతోనే కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించిందని.. మంత్రి తుమ్మల అందరినీ సమానంగా చూస్తున్నారని పార్టీలో చేరిన కార్పొరేటర్లు, నేతలు తమ అనుయాయులతో చెబుతుండగా, ఇది జీర్ణించుకోలేకే పాత నేతలు వైరానికి కాలు దువ్వుతున్నారనే ప్రచారం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు ఇల్లెందు మండలం పూబల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత ఇల్లెందు జేకే బస్టాండ్ వద్ద 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్న మంత్రి, అనంతరం బోయితండాలో బీటీ రోడ్డు, రొంపేడులో చెక్‌పోస్టు, కోటిలింగాలలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుండి బయలుదేరి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే సభలో పాల్గొనేందుకు మంత్రి బయలుదేరతారు.

మంత్రి తుమ్మల...

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఖమ్మం విద్యానగర్ కాలనీ, 10వ డివిజన్‌లోని చైతన్యనగర్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి ఆతర్వాత కోదాడ, తుంగతుర్తిలో జరిగే కార్యక్రమాలకు బయలుదేరతారు.

ఏప్రిల్ 20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు వచ్చేనెల 20నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పది, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2–30గంటల నుంచి 5–30గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. అలాగే, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26నుంచి మే 3వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

సాగునీరు వృథా కాకుండా పర్యవేక్షణ



చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ: ఎక్కడ కూడా సాగునీరు వృథా కాకుండా పర్యవేక్షిస్తూ పంటలకు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. ముదిగొండ మండలం కమలాపురంలో శనివారం పర్యటించిన ఆమె పంట కాల్వ, చెరువు, పంటలను పరిశీలించాక గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. రబీలో ఏయే పంటలు సాగు చేశారు. సాగునీటి సరఫరా ఎలా జరుగుతోందని ఆరా తీసి మాట్లాడారు. చెరువులో నీటి మట్టం తక్కువగా ఉన్నందున సాగర్ నీటితో నింపాలని కోరగా, సమన్వయంతో పనిచేస్తూ సాగునీటి సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూడాలని ఆమె అధికారులకు ఊచించారు. తొలుత అంకమ్మ దేవాలయంలో అదనపు కలెక్టర్ పూజలు చేశారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకీ కిషోర్, నాయబ్ తహసీల్దార్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మి, మాజీ ఎంపీటీసీ వల్లూరి భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకం, పల్లకీసేవ



ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం చేశాక, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించారు. కాగా, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు పిల్లలతో కలిసి వచ్చి పూజలు చేశారు.ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభాలకు 'యూనిక్' నంబర్లు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యలను ప్రాంతం ఆధారంగా త్వరగా గుర్తించేలా 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ వేయిస్తున్నామని ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఇప్పటి వరకు 33 కేవీ విభాగంలో 55 ఫీడర్లు, 11 కేవీ పరిధిలో 159 ఫీడర్లలో ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసమే కీలకం

- మొహమాటం వీడితే ఇంగ్లిష్‌పై పట్టు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



బాలికలు ఆంగ్లంలో మాట్లాడుతుండగా వింటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల: విద్యార్థులు మొహమాటాన్ని విడనాడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మండలంలోని పెద్దమునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఉయ్ కెన్ లెర్న్' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులకు వివిధ కారణాలతో చదివే అవకాశం లేకున్నా పిల్లలు మంచిస్థాయికి చేరాలని చదివిస్తున్నందున వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దన్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, మూడునెలల్లోనే ఆశించిన మార్పు తీసుకొచ్చిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం పలువురు విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడించిన కలెక్టర్ వారిని అభినందించారు. డీఈఓ ఈ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ అబ్రహం, ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, హెచ్‌ఎం కృష్ణయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాము పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి వరకు సాగర్ జలాలు



సాగర్ నీటి సరఫరాపై సూచనలు చేస్తున్న కలెక్టర్

చింతకాని: పంటలు ఎండిపోకుండా సాగర్ ఆయకట్టు చివరి భూములకు సైతం నీరందిస్తామని, రైతులు నీటిని వృథా కాకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. చింతకాని మండలం నాగులవంచలోని సీతంపేట ఎన్నెస్పీ మేజర్ కాల్వను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాలువ కట్టపై రైతులతో సమావేశమై సాగు చేసిన పంటలు, సాగునీటి లభ్యత, ధరణి సమస్యలపై ఆరాతీశారు. కొద్దిరోజుల పాటు ఆయకట్టుకు సాగర్ జలాలు అందిస్తే పంటలకు ఢోకా ఉండదని రైతులు చెప్పగా.. పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అయితే, పత్తి, మొక్కజొన్న, పెసర, మిర్చి మాత్రమే కాక ఆయిల్‌పామ్‌పై రైతులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందుకోసం రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కాగా, మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని, నాగులవంచలో గ్రంథాలయం, బ్యాంక్, ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, ఏడీఏ విజయ్‌చంద్ర, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, ఏఈలు మహేష్, సురేష్, సందీప్, విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరి, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఏఓ మానస పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా సమన్వయంతో పనిచేయాలి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఎక్కడ కూడా యాసంగి పంటలు ఎండిపోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆయన ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ, నీటిపారుదల శాఖ ఏఈతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలతో మండలాల వారీగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటుచేసి రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌పై సమాచారం ఇవ్వాలని చెప్పారు. పంట చేతికి వచ్చే వరకు అప్రమత్తంగా ఉంటూ నీరు సరఫరా చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఏఓ పుల్లయ్య, జల వనరుల శాఖ ఎస్‌ఈలు వాసంతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో పుస్తకాల గది ఉండాలి..

- కట్నం తీసుకోవద్దు.. తీసుకుంటే వెనక్కి ఇవ్వాలి
- స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



దీక్షలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రవీణ్‌కుమార్

నేలకొండపల్లి: ప్రతీ ఇంట్లో పుస్తకాల గది ఏర్పాటు చేసుకోవాలని స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సూచించారు. నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం వద్ద స్వేరోస్ ఆధ్వర్యాన చేపట్టిన భీమ్ దీక్షను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాన్షీరాం జయంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు దీక్ష కొనసాగుతుందని, ఈ దీక్ష నెల మాత్రమే కాకుండా జీవితాంతం చేపట్టాలని పిలుపునిచ్చారు. దీక్షలో భాగంగా కుటుంబమంతా వారానికి కనీసం మూడు రోజులు పుస్తక పఠనం చేయాలని, ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. స్వేరోలు ఏ పని చేసినా ఆ రంగంలో అందరికంటే గొప్పగా రాణించేలా కష్టపడాలని సూచించిన ఆయన అప్పులు చేసి పెళ్లి జరిపించడం కాకుండా తీసుకున్న కట్నం వెనక్కి ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాగా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలు పొందే అవకాశాలు తగ్గుతున్నందున సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జ్ఞానం పెంచుకోవాలని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాబోయే రోజుల్లో స్వేరోస్‌ను అన్ని ఖండాలకూ విస్తరిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, జ్ఞాన ఖడ్గధారణ చేయడమే కాక పిల్లల కాళ్లు కడిగారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ప్రతినిధులు వీరయ్య, ప్రవీణ్, బల్గూరి దర్గయ్య, బాలప్రసాద్, రమేష్, సదానందం, పుల్లయ్య, కిషన్, ప్రకాష్, లలిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేని సరఫరానే లక్ష్యం

- వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్
- ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

నేలకొండపల్లి: వేసవిలో విద్యుత్ వినియోగం పెరగనున్నందున కోతలు లేకుండా, డిమాండ్‌కు తగినట్లు సరఫరా చేయడమే తమ లక్ష్యమని ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి వెల్లడించారు. నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని శనివారం పరిశీలించిన ఆయన నేలకొండపల్లిలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. వినియోగదారులకు మర్యాద ఇవ్వడమే కాక వారి సమస్యలు సత్వరం పరిష్కరించాలని సూచించారు. అంతేకాక ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.

36 సబ్‌స్టేషన్ల ఇంటర్ లింక్

ఉద్యోగులతో సమీక్ష అనంతరం ఎస్‌ఈ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 36 విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా సరఫరా కోసం ఇంటర్ లింక్ పనులు చేపడుతుండగా ఇప్పటికే 11చోట్ల పూర్తయ్యాయని చెప్పారు. అలాగే, కొత్తగా ఏడు సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేయడంతో పాటు లోడ్‌కు అనుగుణంగా 767సబ్‌స్టేషన్లలో 250 చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి మొబైల్ వాహనాలు సమకూర్చామని, వినియోగదారులకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కాగా, జిల్లాలో 2.54 లక్షల మందికి గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందుతోందని, ఇప్పటివరకు వీరు రూ.40.55కోట్ల సబ్సిడీ పొందారని ఎస్‌ఈ వెల్లడించారు. ఈసమావేశంలో డీఈఈలు చింతమళ్ల నాగేశ్వరరావు, హీరాలాల్, ఏఈలు కె.రామారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు లేని నగరంగా ఖమ్మం

- ప్రజల వినతి మేరకు రోడ్ల విస్తరణ
- తీగల వంతెన పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల



టబ్‌లో వెళ్తూ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: ప్రజల వినతి మేరకు రోడ్లు విస్తరిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లు లేని నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దే కృషి జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మున్నేటిపై తీగల వంతెన నిర్మాణ పనులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. బ్రిడ్జి పనులు రెండువైపుల నుంచి చేపడుతూ జూన్‌లోగా పూర్తిచేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.180 కోట్లు కేటాయించగా, ఇందులో రూ.39కోట్లు భూసేకరణ పరిహారం చెల్లించనున్నామని తెలిపారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ఖమ్మంకు మణిహారంగా మారుతుందన్నారు. కాగా, భూములు, ఆస్తులు కోల్పోయిన వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఇక పొన్నెకల్ నుండి ఇల్లెందు క్రాస్ రోడ్డుకు జాతీయ రహదారిని అనుసంధానించేలా రోడ్డు నిర్మాణానికి రూ.120 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రవికుమార్, వివిధ ఉద్యోగులు, నాయకులు చంద్రశేఖర్, విశ్వనాథ్, రావూరి సైదబాబు, సాధు రమేష్‌రెడ్డి, శరత్, బాలగంగాధర్ తిలక్, తుపాకుల యలగొండస్వామి, పాటిబండ్ల యుగంధర్, క్రాంతిసిన్హా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో...

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కాల్వొడ్డులోని మదర్సాలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రషీద్ పాల్గొన్నారు.

64మంది మావోయిస్టుల లొంగుబాటు

- మిగిలిన వారూ జనజీవన స్రవంతిలో కలవాలి
- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచన
- ఒక్కొక్కరికి రూ.25వేల సాయం అందజేత

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ చేయూతలో భాగంగా మావోయిస్టు పార్టీకి చెందిన 64 మంది మల్టీజోన్ –1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట శనివారం లొంగిపోయారు. వారిలో 48 మంది పురుషులు, 16 మంది మహిళలు ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.16లక్షల ఆర్థిక సాయాన్ని ఐజీ వారికి అందజేశారు. ఈ మేరకు హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని, దీనికి ఆకర్షితులైన మావోయిస్టులు లొంగిపోవడానికి మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో బస్తర్ ఏసీఎం మడకం జిమ్మి అలియాస్ లక్ష్మి, పార్టీ క్రియాశీలక సభ్యులు 10 మంది, ప్రజా విప్లవ సంఘం సభ్యులు తొమ్మిది మందితో పాటు ఇతర అనుబంధ సంఘాల సభ్యులు ఉన్నారని వివరించారు. గత రెండున్నర నెలల్లో 122 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. మిగితా వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆదివాసీ గిరిజనుల్లో మావోయిస్టులపై నమ్మకం, ఆదరణ సన్నగిల్లుతున్నాయని చెప్పారు. కాలం చెల్లిన సిద్ధాంతాలు అనుసరిస్తున్న మావోలు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఏజెన్సీ అబివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదనే కారణంతో అమాయక ఆదివాసీలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలు వచ్చేలా పోలీసు యంత్రాంగం ఎప్పుడూ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌లు రితేష్‌ఠాకూర్, ప్రీత, రాజేష్ డోగ్రా తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా పర్యటనలో భాగంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్, షీ టీం ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.

క్లుప్తంగా

జిల్లా న్యాయ సేవాసంస్థ సభ్యుల నియామకం


శ్రీనివాసరావు


సంధ్యారాణి

ఖమ్మం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులైన మందడపు శ్రీనివాసరావు, పి.సంధ్యారాణితో పాటు సామాజిక కార్యకర్త డాక్టర్ డి.పూర్ణచంద్రరావులను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా న్యాయ సేవాసంస్థ అధ్యక్షులుగా జిల్లా జడ్జి వ్యవహరిస్తుండగా, కలెక్టర్, సీపీ, చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ప్రభుత్వ న్యాయవాదులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. వీరితో పాటు సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, న్యాయ సేవాసంస్థ కార్యకలాపాలపై ఆసక్తి ఉన్న వారిని సభ్యులుగా నియమిస్తారు. ఇందులో భాగంగానే వీరిని నియమించగా రెండేళ్ల పాటు సభ్యులుగా కొనసాగనున్నారు.

సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా కుటుంబరాజు


కుటుంబరాజు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైలు సూపరింటెండెంట్‌గా ఉబ్బల కుటుంబరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మధిర సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయనను ఇక్కడకు బదిలీపై చేశారు. ఈనెల 11న సత్తుపల్లి సబ్‌జైల్ నుంచి రిమాండ్ ఖైదీ పరారు కాగా, బాధ్యులుగా సూపరింటెండెంట్ సోమరాజు సంపత్, వార్డర్లను సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ స్థానంలో నియమితులైన కుటుంబరాజు విధుల్లో చేరారు.

ఆరేళ్ల క్రితం ఒకరు.. ఇప్పుడు ఇంకొకరు

- ఇద్దరు కుమారుల మృతితో మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు


సాయికృష్ణ (ఫైల్)

కారేపల్లి: స్నేహితులతో కలిసి సంతోషంగా హోలీ ఆడిన బాలుడు అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. మండలంలోని దుబ్బతండాకు చెందిన బానోత్ రమేశ్–శైలజ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడికి రెండు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు ఆరేళ్ల క్రితం జ్వరంతో మృతి చెందాడు. ఇక పెద్ద కుమారుడు సాయికృష్ణ(12) కారేపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా 20రోజుల క్రితం జ్వరం వచ్చింది. చికిత్స అనంతరం కోలుకుని పాఠశాలకు వెళ్తుండగా ఈ నెల 14వ తేదీన హోలీ వేడుకల్లో స్నేహితులతో కలిసి పాల్గొన్నాడు. ఈక్రమాన శనివారం సాయికృష్ణ అస్వస్థతకు గురి కాగా, స్థానిక ఆస్పత్రిలో చూపించి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఆరేళ్ల క్రితం ఒకరు, ఇప్పుడు ఇంకో కుమారుడు మృతి చెందడంతో రమేశ్–శైలజ గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

సేవా లోపంపై ట్రావెల్స్ సంస్థకు జరిమానా

ఖమ్మం లీగల్: సేవా లోపం కింద హైదరాబాద్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ యాజమాన్యం రూ.35వేలు చెల్లించాలంటూ ఖమ్మం జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎం.మాధవీలత శనివారం తీర్పునిచ్చారు. వివరాలిలా.. ఖమ్మం వాసి వనం నీతు గత ఏడాది ఏప్రిల్ 15న కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి ఖమ్మం వచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ ఏసీ బస్సులో రూ.8,032 చెల్లించి టికెట్లు బుక్ చేసింది. ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో సాంకేతిక లోపం తలెత్తగా బస్సు నిలిచిపోయినా యాజమాన్యం స్పందించలేదు. మూడు గంటలపాటు రోడ్డుపైనే ఉన్నాక రూ.7వేలకు క్యాబ్ మాట్లాడుకుని ఖమ్మం వచ్చారు. ఆపై న్యాయవాది చార్లెస్ వినయ్ ద్వారా వినియోదారుల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా టికెట్ రుసుము రూ.8,032తో పాటు ఏడు శాతం వడ్డీ, క్యాబ్ చార్జీ రూ.7వేలు, మనోవేదనకు గురైనందుకు రూ.10వేలు, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.10వేలు కలిపి రూ.35 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

పర్యాటక వెలుగులు..!

ఆహ్లాదం.. ఆకర్షణీయం వెలుగుమట్ల అర్బన్‌పార్కు

- వీకెండ్స్‌లో మరింత రద్దీ
- రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- పిక్నిక్‌లకు వేదికగా మారిన పార్కు


వెలుగుమట్ల అర్బన్ పార్కు ముఖ ద్వారం


పార్కులోని సోలార్ షెడ్డు

ఎర్రచందనం చెట్టును పరిశీలిస్తున్న విద్యార్థులు

పిక్నిక్‌కు వచ్చిన ఓ పాఠశాల విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వెలుగుమట్ల అర్బన్ పార్కు పర్యాటకులను ఆకర్షిస్తోంది. వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కు పర్యాటపరంగా నగరవాసులకు వరంగానే చెప్పొచ్చు. ఏళ్లుగా ఈపార్కును గత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. ఈక్రమంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో పార్కు అభివృద్ధికి నోచుకుంది.

పాలకుల ప్రత్యేక దృష్టి..

వీకెండ్స్‌లో నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అధికారులు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులకు శ్రీకారం చుట్టారు. కాగా, గతంలో కంటే సందర్శకులు పెరిగినట్లు పార్కు అధికారులు చెబుతుండడంతో చిన్న చిన్న పార్టీలు, గ్రూప్ మీటింగ్‌లు, ఆత్మీయ సమ్మేళనాలు తదితర వాటికి వేదిక కావాలని గత కొన్ని మాసాలుగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థలు ప్రత్యేక దృష్టి సారించారు.

సందర్శకుల సందడి..

రానురాను పార్కుకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. దీంతో గతంలో రోజు 20 నుంచి 30 మంది వరకు పార్కు సందర్శన వస్తుండగా.. ప్రస్తుతం రోజుకు 100 నుంచి 200 వరకు వస్తున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో సుమారు 300 నుంచి 500 వరకు వస్తుండడంతో మరింత రద్దీ పెరిగింది. ఇటీవల కాలంలో ఆహ్లాదంతో పాటు విజ్ఞానపరంగా ఉపయోగపడుతుందని భావించిన జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పిక్నిక్ పరంగా పెద్ద ఎత్తున వచ్చిపోతున్నారు. పార్కులోని వివిధ రకాల మొక్కలు, పచ్చదనం, సేదదీరడానికి హట్, పార్కు వీక్షించేందుకు వాచ్ టవర్, చిల్డ్రన్ పార్కు, యోగా షెడ్డు తదితరాలతో పాటు పార్కునంతా వీక్షించడానికి ఓపెన్ జీపు సైతం అందుబాటులో ఉంచారు. ఇవేకాక సైకిల్ ట్రాకింగ్, పచ్చికబయళ్లు, తాగు నీటి ప్లాంట్ సౌకర్యాలు కల్పిస్తుండడంతో నగరవాసులను ఆకర్షిస్తోంది.

చకచకా అభివృద్ధి పనులు..

పార్కు అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించి రూ. 2 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో ఇప్పటికే ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డు నుంచి పార్కు వరకు డబుల్ లేన్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నారు. ఇవే త్వరగా పూర్తయితే ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు ఒక వేదికగా తయారవుతోందని అధికారులు చెబుతున్నారు. కాగా, రోడ్డు విస్తరణలో కొంతమంది ప్లాట్లదారులు తమ విలువైన స్థలాలు కోల్పోతుండడంతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పనుల్లో అక్కడక్కడ జాప్యం జరుగుతుండగా.. వాటిని సెటిల్ చేసే పనుల్లో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

పని వేళలు..

పర్యాటకులు అర్బన్ పార్కును సందర్శించేందుకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అనుమతి ఉంటుంది. టిక్కెట్ ధర పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, పార్కింగ్‌కు ద్విచక్రవాహనానికి రూ.10, కారుకు రూ.20, బస్సుకు రూ.100 వసూలు చేస్తున్నారు. కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్‌లో ఎండ ప్రభావం లేకుండా సోలార్ షెడ్డు సైతం ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఒక వైపు వాహనాల నీడ పార్కింగ్, మరో వైపు సోలార్ విద్యుత్ తయారీకి ఎంతో ఉపయోగకరంగా మారింది.

ప్లాస్టిక్ నిషేధం..

పార్కు లోపల ప్లాస్టిక్ నిషేధం అమలుకు శ్రీకారం చుట్టారు. బయట ఫుడ్ అనుమతి లేకుండా పార్కు లోపలే ప్లాస్టికేతర తినుబండరాలు విక్రయించేలా చేస్తున్నారు. ఇదే అమలైతే పచ్చదనం అందించడంతో పాటు ప్లాస్టిక్ జాడలేకుండా ప్రజాప్రతినిధులు, అధికారుల చర్యలు చేపట్టారు.

ఆహ్లాదంగా ఉంది..



పచ్చదనంతో అటవీపార్కు చాలా బాగుంది. ప్రధాన రోడ్డు నుంచి పార్కులోకి రోడ్డు సరిగా లేకపోవడం కాస్తా ఇబ్బందిగా ఉంది. మా పిల్లలు పాఠశాల తరఫున సందర్శించి బాగుందని చెబితే నేను చూడాలని వచ్చా. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే నగరవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– డి.సతీష్, పర్యాటకుడు, ఖమ్మం

సైలో బంకర్ సమస్య పరిష్కరించండి

సింగరేణి సీఎండీని కలిసిన ఎమ్మెల్యే


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని ఓసీల నుంచి బొగ్గు రవాణాకు ఏర్పాటుచేసిన సైలోబంకర్ ద్వారా స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్న నేపథ్యాన స్పందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాంను శనివారం కలిసిన ఆమె సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు, కిష్టారం వాసుల దీక్షలపై వివరించారు. కాలుష్య ప్రభావంతో పలువురు మృతి చెందగా, బాంబ్ పేలుళ్లలో ఇళ్లు దెబ్బతిన్నందున బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య వినతితో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సింగరేణి ఓసీలు, సైలోబంకర్ ద్వారా ఎదురవుతున్న సమస్యలను శనివారం శాసన మండలిలో ప్రస్తావించారు.

కిష్టారం సింగరేణి బాధితుల దీక్ష విరమణ


నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న దయానంద్

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: సింగరేణి సైలో బంకర్‌తో అనారోగ్యం బారిన పడుతున్నామని చేపట్టిన దీక్షలను సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్ నగర్ వాసులు శనివారం విరమించారు. దీక్షలు శనివారం 34వ రోజుకు చేరగా, వారికి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిపరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే, ఎంపీ రఘురాంరెడ్డి సమస్యను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఫోన్‌లో చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. సింగరేణి పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు, నాయకులు గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్‌పాషా, మారోజు నాగేశ్వరరావు, కడారి మదీనా, వాడపల్లి నాగమణి, నాగరత్నం, అశోక్, ప్రవీణ్, ఏసమ్మ, నిర్మల, కమల, అరుణ పాల్గొన్నారు.

గాయపడిన కానిస్టేబుల్‌కు పరామర్శ..

అంతర్రాష్ట్ర దొంగను పట్టుకునే క్రమాన తీవ్రంగా గాయపడిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్‌ను కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తుమ్మల యుగంధర్ పరామర్శించారు. వీరి వెంట సీఐ టి.కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఏదులాపురం కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి?

ఖమ్మంరూరల్: జిల్లాలోని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాసరెడ్డి నియమితులైనట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న మున్సిపల్ పాలన ప్రారంభం కాగా కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాను తాత్కాలిక కమిషనర్‌గా నియమించారు. ఈనేపథ్యాన పూర్తిస్థాయి కమిషనర్‌గా డీఆర్‌డీఏలో ఏపీడీగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు తెలిసింది. గతంలో ఆయనకు కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉండగా, ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని పెదతండా గ్రామ ప్రత్యేకాధికారిగా కూడా పనిచేశారు. ఈమేరకు త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం.

ఇక్కడ పుట్టిన వారంతా భారతీయులే...


సభలో మాట్లాడుతున్న సిరాజుల్ రెహమాన్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రవక్త మహమ్మద్ ఉల్లేఖనం ప్రకారం ముస్లింలు ఏ ప్రదేశంలో పుడితే అదే వారి మాతృభూమి అని.. తద్వారా భారత్‌లో పుట్టిన ముస్లిం, మైనార్టీలంతా భారతీయులే అయినందున మాతృభూమిని ప్రేమించడం కర్తవ్యమని ప్రవచనకారుడు, పీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజుల్ రెహమాన్ తెలిపారు. ఖమ్మంలో డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ ది రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ (డేర్) ఆధ్వర్యాన శనివారం ఇఫ్తార్ విందుతో పాటు సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో రెహమాన్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి భారత్ ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం 'డేర్' రాష్ట్ర కార్యదర్శి నోమాన్ రిజ్వీ, ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణ, డాక్టర్ జగదీష్ మాట్లాడారు. ఈసదస్సులో వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, కూరపాటి ప్రదీప్‌కుమార్, రవికుమార్, జంగాల సునీల్, కిరణ్, కుప్పు ధనమూర్తి, సురేందర్, సురేష్, తేజ, బాబు రత్నాకర్, విజయలక్ష్మి, పుష్పలతతో పాటు డాక్టర్ అన్వర్, ఆరిఫ్, ముస్తాక్, ఫయాజ్, గులాం షరీఫ్, మన్సూర్ ఇలాహి తదితరుల పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు


వైరారూరల్: వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

పెనుబల్లి: పంటలకు కావాల్సిన ఎరువుల ధరలు పెంచితే వ్యాపారులు లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. పెనుబల్లి సొసైటీతో పాటు కారాయిగూడెం, వీఎం బంజర్‌లోని పలు షాపుల్లో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులను పరిశీలించి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏఓ ఏవీఎస్ఎస్. రాజు, ఏఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

వైరారూరల్: సాగర్ ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని డీఏఓ డి.పుల్లయ్య సూచించారు. వైరా మండలం అష్ణగుర్తి, రెబ్బవరం, తాటిపూడిల్లో పంటలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. వారబందీకి అనుగుణంగా నీరు వినియోగించుకోవాలని తెలిపారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాసరావు, ఏఓ మయాన్ మంజుఖాన్, ఎంపీడీఓ సరస్వతి, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, ఏఈఓలు రాజేష్, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



నేలకొండపల్లి: రహదారిపై స్కూటీని తప్పించే క్రమాన స్తంభాన్ని ఢీకొట్టిన కారు పొలాలకు దూసుకెళ్లింది. మండలంలోని అజయ్‌తండాకు చెందిన తేజావత్ ప్రసాద్, తేజావత్ రూప్లా, గోవిందరావుతో పాటు సూర్యాపేటకు చెందిన లింగా కారులో శనివారం చెరువుమాధారం నుంచి ఆజయ్‌తండాకు వెళ్తున్నారు. ఈక్రమంలో గ్రామంలోని పాఠశాల సమీపాన ఎదురుగా వచ్చిన స్కూటీని తప్పించబోయి కారు స్తంభాన్ని ఢీకొట్టి పక్కనే పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న వారు గాయపడగా.. స్థానికులు బయటకు తీసి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, ప్రమాదంలో స్తంభం విరిగిపోగా ఆ సమయాన విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

ఇసుక టిప్పర్ సీజ్..

పెనుబల్లి: ఏపీ ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను వీఎం బంజర్ పోలీసులు శనివారం తెల్ల వారుజామున సీజ్ చేశారు. ఎలాంటి పన్ను చెల్లించకుండా తెలంగాణ ఆదాయానికి గండి కొట్టేలా పలువురు ఏపీ నుంచి ఇసుక తీసుకొచ్చి పెనుబల్లి, పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని లారీ అసోసియేషన్ బాధ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై కె.వెంకటేష్ తనిఖీలు చేపట్టగా టిప్పర్ పట్టుబడింది. భద్రాచలం నుంచి తీసుకొస్తున్న ఇసుక టన్ను రూ.1,300 నుంచి రూ.1,400కు విక్రయిస్తుండగా(పన్నుతో కలిపి), ఏపీ నుంచి తీసుకొచ్చే ఇసుక టన్ను రూ.900 నుంచి రూ.వెయ్యి వరకే విక్రయిస్తూ ఎలాంటి పన్ను చెల్లించడం లేదని గుర్తించారు. ఈమేరకు లారీ యజమాని, డ్రైవర్, ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

బోనకల్: ఓ వివాహిత ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని ఆళ్లపాడుకు చెందిన షేక్ మస్తాన్ – జరీనా(28)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అత్త మైబూబీతో కలిసి శనివారం మధ్యాహ్నం ఇంటి ఎదుట ఉన్న జరీనా, కాసేపు విశ్రాంతి తీసుకుంటానని ఇంట్లోకి వెళ్లింది. ఆమె ఇద్దరు కుమారులు మధ్యాహ్నం స్కూల్ నుంచి వచ్చాక ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల తలుపులు పగులగొట్టారు. అప్పటికే ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆటోడ్రైవర్‌గా కిరాయికి వెళ్లిన మస్తాన్ స్థానికంగా లేకపోవడంతో ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఆటోను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

- అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి


అనిల్‌కుమార్ (ఫైల్)

చింతకాని: మండలంలోని నర్సింహాపురం సమీపాన గ్యాస్ గోదాం వద్ద ఆటోను గుర్తుతెలియని ఓ వాహనం ఢీకొట్టిన ఘటనలో రఘునాథపాలెంకు చెందిన గాజుల అనిల్‌కుమార్(35) మృతి చెందాడు. శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలు... సొంత ఆటో ఉన్న అనిల్‌కుమార్ ఖమ్మంలోని ఓ దినపత్రిక ప్రెస్ నుంచి పేపర్ పార్సిళ్లను తీసుకొచ్చి గ్రామాల్లో వేస్తుంటాడు. ఇలాగే శనివారం తెల్లవారుజామున ఖమ్మం నుంచి అల్లీపురం, చింతకాని మండలం కొదుమూరు, లచ్చగూడెం మీదుగా ఆటోలో చింతకానికి వస్తుండగా నర్సింహాపురం సమీపాన ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో సైతం నుజ్జునుజ్జయింది. ఆయనకు భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద ట్రాలీ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ బీతపూడి నరేంద్ర(46) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దానవాయిగూడెంకు చెందిన నరేంద్ర రాజీవ్ గృహకల్పలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. శనివారం ఆయన ప్లాంట్ నుంచి ట్రాలీ ఆటోలో వాటర్ క్యాన్లు తీసుకుని దానవాయిగూడెం వెళ్తూ ప్రధాన రహదారిపైకి వస్తుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నరేంద్రను ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన భార్య రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

లోక్యాతండాలో దూండ్ వేడుకలు


కామదహనంలో పాల్గొన్న తండావాసులు


గేర్యా, పెద్దల కోలాటం

మూడు రోజుల పాటు హోలీ వేడుకలు జరుపుకునే మండలంలోని లోక్యాతండా వాసులు రెండో రోజైన శనివారం దూండ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈమేరకు గత హోలీ నుంచి ఇప్పటి వరకు జన్మించిన మగ బిడ్డకు అన్నప్రాసన, నామకరణం జరిపించారు. అలాగే, గేర్యా(వేడుకల పెద్దలు) తండావాసులతో కలిసి కోలాటమాడుతూ దూండ్ జరుపుకునే వారి గృహాలకు వెళ్లారు. అక్కడ తల్లీబిడ్డలను ఆశీర్వదించగా దూండ్ నిర్వహించిన వారు విందు ఏర్పాటుచేశారు. కాగా, శనివారం తెల్లవారుజామున తండాలో నిర్వహించిన కామ దహనానికి తండా వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కామదహనం ప్రదేశానికి వెళ్లి పూజలు చేశారు.

– కూసుమంచి

ఈనాడు ఆస్తుల జప్తు

గూడవల్లి వద్ద ఉన్న ఆస్తులపై కోర్టు ఆదేశం

- ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదు
- తాకట్టుపెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదు
- విజయవాడలో లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ఈనాడు
- స్థల యజమానికి రూ.5.2 కోట్లను 6 శాతం వడ్డీతో చెల్లించాలని గతంలో ఆదేశించిన కోర్టు
- పట్టించుకోని ఈనాడు యాజమాన్యం.. దాంతో ఈనాడు ఆస్తుల జప్తు కోరిన బాధితుడు
- గతంలో విశాఖ స్థల యజమానికీ ముప్పుతిప్పలు..
- కొనసాగుతున్న ఈనాడు దౌర్జన్యం.. కోర్టులు ఆదేశించినా లెక్కలేనితనం



సాక్షి, అమరావతి: అందరికీ నిత్యం ఉదయాన్నే నీతులు చెప్పే ఈనాడు (ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్) దౌర్జన్యం కొనసాగుతోంది. తమ పత్రిక ద్వారా జనాలకు నీతులు మాత్రమే చెబుతామని, వాటిని తాము మాత్రం ఆచరించమని ఈనాడు మరోమారు నిరూపించింది. గతంలో విశాఖపట్నం ఈనాడు కార్యాలయం స్థలం విషయంలో దాని యజమాని ఆదిత్య వర్మను ముప్పుతిప్పలు పెట్టిన ఈనాడు యాజమాన్యం, ఇప్పుడు విజయవాడలో ఉన్న కార్యాలయ స్థలం విషయంలో కూడా దాని యజమాని ముసునూరు అప్పారావును సైతం అలాగే ముప్పుతిప్పలు పెడుతోంది. ఈనాడు పత్రిక కోసం తీసుకున్న స్థలం లీజు గడువు ముగిసినా.. దాన్ని అప్పారావుకు అప్పగించకుండా చుక్కలు చూపిస్తోంది. కోర్టుకెళ్లి అప్పారావు విజయం సాధించినా.. న్యాయస్థానం ఆదేశాలను సైతం ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో కోర్టు ఈనాడు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. స్థల యజమానిని వేధించడానికే ఆ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది.

కాగా.. బాధితుడు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6 శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం ఈనాడు యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనాడు ఆస్తుల జప్తునకు న్యాయస్థానం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు ఆస్తులను బదలాయించడం, తాకట్టు పెట్టడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం చేయరాదని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ఆస్తులను ఎవరూ కొనడం, బహుమతిగా తీసుకోవడం చేయరాదంది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈనాడు ఎండీ కిరణ్‌ను ఆదేశించింది.

అసలు కథ ఏమిటంటే..

ఈనాడు యజమాని రామోజీరావు 1975లో విజయవాడ పటమట లంకలో ముసునూరి అప్పారావుకు చెందిన 92 సెంట్ల స్థలాన్ని 33 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.725 అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పక్కనే అప్పారావు సమీప బంధువైన వల్లూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఎకరా 47 సెంట్ల భూమిని కూడా రామోజీరావు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు 30.04.2008న ముగిసింది. దీంతో మరో 33 ఏళ్ల పాటు లీజు పొడిగించాలని స్థల యజమాని అప్పారావును రామోజీరావు కోరారు. రామోజీ సంగతి బాగా తెలిసిన అప్పారావు లీజు పొడిగింపునకు నిరాకరించారు. 6 నెలల్లో స్థలాన్ని ఖాళీ చేసి ఇవ్వాలని రామోజీరావుకు తేల్చిచెప్పారు. 6 నెలల గడువు 2008 అక్టోబర్‌తో ముగిసింది. అయినా రామోజీరావు ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. ఇదే సమయంలో మరో 33 ఏళ్లపాటు లీజు పొడిగించేలా అప్పారావును ఆదేశించాలంటూ విజయవాడ జిల్లా కోర్టులో రామోజీరావు సూట్ దాఖలు చేశారు. దానిని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2013లో కొట్టేసింది. అప్పారావుకు చెందిన స్థలంపై ఈనాడుకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది. అంతేకాక ఈనాడు ఆ స్థలంలో ఉండటం అక్రమమేనని స్పష్టం చేసింది. దీనిపై ఈనాడు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను సైతం కోర్టు కొట్టేసింది.

పరిహారంగా రూ.5.20 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించినా..

ఈ నేపథ్యంలోనే 2015లో ముసునూరి అప్పారావు తన స్థలం నుంచి ఈనాడును ఖాళీ చేయించాలని కోరుతూ విజయవాడ కోర్టులో సూట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అప్పారావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దాదాపు 60 పేజీల తీర్పు వెలువరించింది. 2012–15 వరకు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6శాతం వార్షిక వడ్డీతో పరిహారంగా చెల్లించాలని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. మిగిలిన కాలానికి పరిహారం కోసం పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటును అప్పారావుకు ఇస్తూ 2024 అక్టోబర్ 3న తీర్పునిచ్చింది. అయితే.. ఈ తీర్పును ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో తీర్పు అమలుకు అప్పారావు కింది కోర్టులో ఈపీ దాఖలు చేశారు. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు కార్యాలయాన్ని జప్తు చేయాలని అందులో కోరారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తాము ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించడంలో ఈనాడు విఫలమైందని తేల్చింది. ఇందుకు గాను ఈనాడు ఆస్తుల జప్తునకు ఆదేశిస్తున్నట్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తూ విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

భారత్.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఆధ్యాత్మికాన్ని పెంపొందించడంలో బ్రహ్మకుమారీల పాత్ర అభినందనీయమన్నారు. మితిమీరిన 'ఇన్‌స్టంట్'కు అలవాటుపడితే అనారోగ్యాన్ని ఆహ్వానించినవారవుతారని హెచ్చరించారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి: జస్టిస్ ఎస్వీ భట్టి

న్యాయమూర్తులు, న్యాయవాదులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే అసాధ్యాలు కూడా సుసాధ్యం కాగలవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సారస వెంకటనారాయణ భట్టి చెప్పారు. న్యాయవాదులకు స్వీయ అవగాహన ఉండాలని, కేసును, కక్షిదారుడిని అర్థం చేసుకున్నప్పుడే సమర్థ వాదన సాధ్యపడుతుందన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని.. అపజయానికి కుంగిపోవడం, విజయానికి పొంగిపోవడం వృత్తినే కాదు, వ్యక్తిత్వాన్నీ దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. ఏం చేస్తున్నాం.. ఎలా చేస్తున్నాం.. అనే సమీక్ష అందరికీ అవసరమన్నారు. వృత్తిపరంగా ప్రతికూల ఆలోచనలు వస్తుంటాయని.. కొన్నిసార్లు మనసు కలుషితం అవుతుందని చెప్పారు. సానుకూలత లేకుండా సరైన నిర్ణయం తీసుకోలేమని చెబుతూ.. జరిగిందేదో జరిగిపోయింది.. సానుకూలంగా ముందుకెళ్తాను అనే ధోరణిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ బీడీ రాథి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఎం.రాజేందర్‌రెడ్డి, మాజీ అడ్వొకేట్ జనరల్‌లు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ.. దేశ ఆర్థిక చరిత్రలో ఓ మలుపు: గవర్నర్

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టడం మన దేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. శనివారం తాజ్ దక్కన్ హోటల్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో జీఎస్టీ రూపకల్పనలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రపై సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం అవసరమన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను విధానానికి జీఎస్టీ దోహదం చేసిందన్నారు. సాహసోపేతమైన సంస్కరణల మాదిరిగానే జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు అవాంతరాలు తప్పలేదని పేర్కొన్నారు. ఎక్కడైతే ప్రజలకు న్యాయం అందుతుందో.. అక్కడ ధర్మంతోపాటు రాజుకు బలమైన పునాది ఏర్పడుతుందని కౌటిల్యుడు చెప్పిన మాటలను ఉదహరించారు. పన్ను చెల్లింపుదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న వన్ టైమ్ వడ్డీ మాఫీ పథకాన్ని ఈ నెల 31లోగా పన్ను చెల్లించి లబ్ధి పొందాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ కె.హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి మాట్లాడారు. ఎఫ్‌టీసీసీఐ జీఎస్టీ కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకుమారన్, శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు నుంచి హోంవర్క్ దాకా..



▶ మొదటి పేజీ తరువాయి

హాలిడేస్ లిస్ట్ వంటివి సైతం యాప్ ద్వారానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రతి విద్యార్థికి సంబంధించి కనీస సామర్థ్యాలు సాధించే దిశగా విద్యార్థి సూచిక (స్టూడెంట్ ప్రొఫైల్) ఉంటుంది. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన తీరు, పురోగతి సాధిస్తున్న అంశాలను ఇందులో పొందుపర్చనున్నారు.

పిల్లలు గైర్హాజరైతే వెంటనే మెసేజీ వస్తుంది



మా పిల్లలు ప్రభుత్వ స్కూల్‌లోనే చదువుతున్నారు. వాళ్లు స్కూల్‌కు వెళ్లకుంటే నా ఫోన్‌కు మెసేజీ వస్తుంది. ఇలా తల్లిదండ్రులకు విద్యార్థుల సమాచారం తెలపడం బాగుంది. టీచర్లు అసైన్‌మెంట్లను యాప్‌లో పెడుతుండటంతో.. పిల్లలు ఇంటికి వచ్చాక వారిని దగ్గరుండి చదివిస్తున్నాం. – ముక్కెర రమేశ్, విద్యార్థి తండ్రి

'స్థానిక' పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలి

- సీఎంకు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేసింది. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది అని, స్థానిక ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించే ఈ వ్యవస్థలో ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు పోటీచేయలేకపోతున్నారని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వారు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న భావన ప్రజల్లో ఏర్పడినందున, తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత జనాభా పెంపుదలను ప్రోత్సహించే దశలో ఉన్నందున ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు.

చంద్రబాబుని మించిన అవకాశవాది పవన్: అంబటి



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుని మించిన అవకాశవాది అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై జయకేతనం సభలో పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తుంటే ఎందుకు నోరెత్తడంలేదని అన్నారు. అంబటి రాంబాబు శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పైకి నిజాయితీపరుడినని చెప్పుకొనే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ, అవినీతి, బెదిరింపులు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పవన్‌కి ప్రియాతి ప్రియమైన మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ దోపిడీకి అడ్డే ఉండటంలేదని అన్నారు. నాయకులు ప్రజల నుంచే పుట్టాలని, వారసత్వ రాజకీయాలేమిటంటూ మాటలు చెప్పే పవన్.. వచ్చిన ఒక్క ఎమ్మెల్సీ పదవినీ అన్న నాగబాబుకే ఇచ్చుకున్నాడన్నారు. ఎన్నికల్లో గెలిపించే బాధ్యత నీదేనంటూ సీటు త్యాగం చేసిన వర్మతో పనిచేయించుకుని, ఆయన వల్ల గెలిచామంటే నీ ఖర్మ అంటూ ఆయన్ని ఎగతాళి చేశారని అన్నారు. అక్కర గడుపుకొని మోసం చేయడంలో, అవకాశవాదంలో చంద్రబాబునే మించిపోయారని చెప్పారు. 40 ఏళ్ల టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని తెలిపారు. పవన్ ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదని, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, టీడీపీకి బి టీమ్‌గా జనసేనను స్థాపించారని చెప్పారు.

'రాయలసీమ'పై కేంద్రం కొరడా

▶ మొదటి పేజీ తరువాయి

సైట్‌ను తనిఖీ చేశాక ఈ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరింది. డీపీఆర్ తయారీ ముసుగులో పర్యావరణానికి ఏదైనా హాని చేసినట్టు తనిఖీల్లో గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వ విజయం: మంత్రి ఉత్తమ్

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయమేనని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా బోర్డు, ఎన్జీటీ, కృష్ణా ట్రిబ్యునల్-2, సుప్రీం కోర్టులను ఆశ్రయించిందన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ తాను కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ రాశారన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణి ఆస్పత్రి సీఎంఓగా ఆర్మీ రిటైర్డ్ డాక్టర్

అక్రమాలకు చెక్ పెట్టేలా నిర్ణయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ)గా ఆర్మీ రిటైర్డ్ డాక్టర్‌ను నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఆస్పత్రి కేంద్రంగా మెడికల్ బోర్డు నిర్వహిస్తుండగా అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతో సీఎండీ ఎన్.బలరామ్ విచారణను ఏసీబీకి అప్పగించినా, దళారుల వివరాలు చెబితే నగదు బహుమతి ఇస్తామని ప్రకటించినా పెద్దగా ఫలితం కానరాలేదు. దీంతో మెడికల్ బోర్డ్‌ను పారదర్శకంగా నిర్వహించాలనే భావనతో ఆస్పత్రి బాధ్యతలు ఆర్మీ రిటైర్డ్ డాక్టర్‌కు అప్పగించాలనే యోచనకు వచ్చినట్లు సమాచారం. ఇందుకోసం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా 25వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముంది. కాగా, 2014కు ముందు మెడికల్ బోర్డ్‌లో ఐదు విభాగాల అధికారుల కమిటీ దరఖాస్తు చేసుకున్న వారిని పరీక్షించి అన్‌ఫిట్ చేసేవారు. అయితే, 2018 నుంచి కార్పొరేట్ ఆస్పత్రి వైద్యుల ద్వారా పరీక్షలు చేయిస్తుండగా అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతోనే ఆర్మీ రిటైర్డ్ వైద్యాధికారిని నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

జీఎంలకు ఈడీ హోదా..

సింగరేణిలో జీఎంలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) హోదా కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సీడీఎస్ హోదాలో ఉన్న ఒక జీఎంను కోల్ మూమెంట్ ఈడీగా నియమించారు. ఇదే సమయాన పర్సనల్, ఫైనాన్స్ విభాగాల్లో పనిచేస్తున్న జీఎంలకు సైతం ఈడీ హోదా కల్పిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే, ఒక్కో పోస్టుకు ఒక జీఎంను కేటాయిస్తే తప్ప న్యాయం జరగని పరిస్థితుల్లో ఒక్కొక్కరికి రెండేసి పోస్టులు ఇవ్వడమే కాక ఇప్పుడు ఈడీ హోదా కల్పించడం ఏంటనే విమర్శలు వస్తున్నాయి. గత 11ఏళ్లుగా పూర్తిస్థాయి డైరెక్టర్(పా)గా ఐఏఎస్ అధికారులను నియమించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారిందని, రెండు, మూడు నెలలకోసారి గ్రీవెన్స్ కూడా జరగడం లేదని చెబుతున్నారు. ఈమేరకు యాజమాన్యం పూర్తి స్థాయి డైరెక్టర్(పా)ను నియమించి జీఎంల విషయంలోనూ పునరాలోచన చేయాలని కార్మికులు కోరుతున్నారు.

భూగర్భ గనులే కీలకం

- సింగరేణిలో 100 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదుపై దృష్టి
- ఇటీవల రీజియన్లలో పర్యటించిన ఉన్నతాధికారులు
- 'చైతన్య యాత్ర'ల పేరిట కార్మికులతో మమేకం



శ్రీరాంపూర్ భూగర్భగనిలో పరిశీలనకు వెళ్తున్న సీఎండీ, డైరెక్టర్లు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా త్వరలో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున కార్మికులు గైర్హాజరు కాకుండా, నెలకు 20 మస్టర్లు తగ్గకుండా పనిచేస్తూ ఆయా గనులు, డిపార్ట్‌మెంట్లకు నిర్దేశించి లక్ష్యాల సాధనకు కృషి చేసిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించింది. అంతేకాక డైరెక్టర్లతో సహా సింగరేణి సీఎండీ బలరామ్ శ్రీరాంపూర్, మందమర్రి, రామగుండం, భూపాలపల్లి, గోదావరిఖని, ఇందారం, న్యూటెక్ తదితర ఏరియాల్లోని భూగర్భ గనుల్లో పర్యటించి ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్పత్తికి ఏమైనా అవాంతరాలు, ఇతరత్రా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మిగిలిన తక్కువ సమయంలో లక్ష్యం మేర బొగ్గు ఉత్పత్తి సాధించాలని, ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయాలని సూచించారు.

ఇంకా మిగిలే ఉంది..

సింగరేణిలో గత ఫిబ్రవరి 12వ తేదీ నాటికి 60.41 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 56.41 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. మిగిలిన సమయంలో 15.59 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఈ ఉత్పత్తి కాస్త పురోగతిలోనే ఉన్నప్పటికీ లక్ష్యం మాత్రం చేరలేదు. ఇప్పటి వరకు భూగర్భ గనుల్లో 52.10 లక్షల టన్నులకు 40.58 లక్షల టన్నులు సాధించగా, ఓపెన్ కాస్ట్ గనుల్లో 55.18 మిలియన్ టన్నులకు 52.34 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదైంది.

ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి వరకు భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఇలా..

ఏరియా	గని	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)	శాతం
కొత్తగూడెం	వీకే-5	3,02,688	1,32,173	44
మణుగూరు	కొండాపురం	2,10,000	1,31,652	72
గోదావరిఖని	1, 3 ఇంక్లైన్	2,07,500	1,14,434	55
గోదావరిఖని	2, 2ఏ ఇంక్లైన్	2,42,625	1,16,489	48
గోదావరిఖని	11 ఇంక్లైన్	7,08,650	5,73,841	81
గోదావరిఖని	వకీల్‌పల్లి	3,02,685	3,15,104	104
భూపాలపల్లి	కేటీకే-1, 1ఏ	2,16,500	1,56,123	72
భూపాలపల్లి	కేటీకే -5 ఇంక్లైన్	2,17,000	1,74,238	80
భూపాలపల్లి	కేటీకే -6 ఇంక్లైన్	1,56,325	1,09,662	70
భూపాలపల్లి	కేటీకే -8, 8ఏ	2,43,350	1,59,833	66
అడ్రియాల	ఏఎల్‌పీ	3,86,515	3,86,515	100
మందమర్రి	కేకే -5 ఇంక్లైన్	1,73,000	1,76,912	102
మందమర్రి	కాసిపేట	2,08,125	1,26,230	61
మందమర్రి	కాసిపేట -2	1,73,000	95,546	55
శ్రీరాంపూర్	ఎస్కే	1,03,750	48,508	47
శ్రీరాంపూర్	ఆర్‌కే-5 ఇంక్లైన్	2,34,875	2,11,456	90
శ్రీరాంపూర్	ఆర్‌కే-6 ఇంక్లైన్	1,55,625	1,64,724	106
శ్రీరాంపూర్	ఆర్‌కే-7	3,11,250	2,64,343	85
శ్రీరాంపూర్	ఆర్‌కే రాంటెక్	1,38,375	1,64,724	106
శ్రీరాంపూర్	ఎస్ఆర్‌పీ -1	1,03,975	81,019	78
శ్రీరాంపూర్	ఎస్ఆర్‌పీ 3, 3ఏ	2,42,625	2,04,888	84
బెల్లంపల్లి	ఐకే-1ఏ ఇంక్లైన్	2,06,813	1,67,679	81

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ఈ ఏడాది కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యసాధన 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధనకు బదిలీ వర్కర్ నుంచి డైరెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి. గనుల్లో 100 శాతం ఉత్పత్తి సాధనకు సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో కార్మిక చైతన్య యాత్రలు నిర్వహించాం. పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించి, ఉత్పత్తికి డిమాండ్ పెరిగేలా చూడాలి. ఉత్పత్తితో పాటు రక్షణకూ ప్రాధాన్యమిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా కీర్తి గడించాలి. – ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

నిల్వ పంటకు రుణ సౌకర్యం

- పంట తాకట్టుపై విలువలో 75శాతం మేర రుణాలు
- ఆరు నెలల పాటు వడ్డీ మినహాయింపు
- ఖమ్మం జిల్లాకు రూ.10.30 కోట్ల నిధులు



కోల్డ్ స్టోరేజీలో నిల్వకు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: పంటకు గిట్టుబాటు ధర లేని పరిస్థితుల్లో నిల్వ చేసి రుణం పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. 'రైతు బంధు' పేరిట ఈ పథకాన్ని మార్కెటింగ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఈ ఏడాది ఖమ్మం జిల్లాకు రూ.10.30 కోట్ల నిధులు కేటాయించింది. 2013–14 నుంచి ఈ పథకం అమలులో ఉన్నా అంతగా ఆదరణ లభించడం లేదు. తొలుత కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన పంటలకు మాత్రమే పథకాన్ని అమలు చేయగా, కరోనా సమయంలో మిర్చి రైతులకు ఉపయోగపడింది. 2020–21లో అత్యధికంగా జిల్లాలో 1,513 మంది రైతులు మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రూ.1,732.52 లక్షల మేర రుణం పొందారు. కాగా, ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులకు అవసరం రాకపోగా, పత్తి పంటకు మాత్రం అవకాశం లేదు. ఇక గత ఏడాది మిర్చికి మంచి ధర ఉండటంతో కేవలం 36 మంది రూ.65 లక్షలను రైతుబంధు పథకం కింద రుణం తీసుకున్నారు. ఈ ఏడాది మాత్రం మిర్చి ధర బాగా పతనమైన నేపథ్యాన రైతులు 'రైతుబంధు'ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు..

మార్కెట్ల వారీగా నిధుల కేటాయింపు

రైతుబంధు పథకానికి మార్కెటింగ్ శాఖ వ్యవసాయ మార్కెట్ల వారీగా నిధులను మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాలోని ఎనిమిది మార్కెట్లకు గాను ఏన్కూరు మినహా మిగిలిన ఏడింటికి నిధులు అందాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రూ.5 కోట్లు, వైరాకు రూ.3 కోట్లు, మధిరకు రూ.కోటి, మద్దులపల్లికి రూ.50 లక్షలు, కల్లూరుకు రూ.50 లక్షలు, నేలకొండపల్లికి రూ.20 లక్షలు, సత్తుపల్లి మార్కెట్‌కు రూ.10 లక్షలు కేటాయించగా మద్దులపల్లి మార్కెట్ పరిధిలో 33 మంది రైతులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

రూ.2 లక్షల రుణం.. ఆరు నెలలు వడ్డీ మినహాయింపు

పంట నిల్వ ఆధారంగా ఒక్కో రైతుకు రూ.2 లక్షల మేర రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. రుణం కావాలనుకునే రైతులు పంటను గోదాంలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి ధ్రువపత్రాలు సమర్పిస్తే అధికారులు ధర ఆధారంగా 75 శాతం మేర రుణంగా చెల్లిస్తారు. ఇది అత్యధికంగా రూ.2 లక్షల వరకు ఉంటుంది. ఇక రుణాలకు ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ ఉండదు. 180 రోజుల నుంచి 270 రోజుల వరకు 12 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. 270 రోజుల్లో రుణం చెల్లించి పంట తీసుకోకపోతే వేలంలో విక్రయించి వచ్చే నగదును మార్కెటింగ్ శాఖ జమ చేసుకుంటుంది. అంతేకాక నిల్వ చేసిన పంటకు బీమా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



పండించిన పంటలను గోదాంలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రైతుబంధు ద్వారా రుణాలు పొందొచ్చు. పంట ధరల ఆధారంగా 75 శాతం మేర రుణంగా అందిస్తాం. గతంలో ధాన్యానికే వర్తింపజేసిన ఈ పథకాన్ని కరోనా తర్వాత మిర్చి పంటకు కూడా వర్తింపజేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – ఎం.ఏ.అలీం, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

వేగంగా మ్యాన్‌రైడింగ్ పనులు

- త్వరలోనే కేపీయూజీ మైన్‌లో అందుబాటులోకి...
- తీరనున్న కార్మికుల కష్టాలు



కేపీయూజీ గనిలో జరుగుతున్న మ్యాన్ రైడింగ్ పనులు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గని(కేపీయూజీ)లో మ్యాన్ రైడింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మరో పది రోజుల్లో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి రానుండగా, కార్మికుల ఇక్కట్లు తీరనున్నాయి. ప్రస్తుతం రోజుకు 1.2 కి.మీ. మేర గనిలోకి నడిచి వెళ్లాల్సి రావడంతో కార్మికుల పని గంటలపై ప్రభావం పడుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ మిషనరీ హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీ ఎంఈహెచ్ఎల్) ఆధ్వర్యాన చేపట్టిన మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వస్తే అటు కార్మికుల ఇక్కట్లు తీరతాయని.. ఇటు ఉత్పత్తి మెరుగవుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ పనులు చాన్నాళ్ల క్రితమే పూర్తి కావాల్సి ఉన్నా డిసెంబర్‌లో ఏర్పడిన బుంగల కారణంగా ఆలస్యమైంది.

పెరగనున్న ఉత్పత్తి

ఆది నుంచి రకకాల కారణాలతో అవరోధాలు ఎదురవుతుండగా, బొగ్గు ఉత్పత్తి కోసం అధికారులు అవస్థలు పడుతున్న నేపథ్యాన కేపీయూజీ మైన్‌లో మ్యాన్ రైడింగ్ పూర్తయితే ఉత్పత్తి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఇక్కడ లభించే జీ-6 గ్రేడ్ బొగ్గుకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి రాగానే కార్మికుల పనిగంటలు పెరుగుతాయని, తద్వారా నిర్దేశిత లక్ష్యాలు సునాయాసంగా సాధించొచ్చని చెబుతున్నారు.

లక్ష్య సాధనకు కృషి

గతంలో కోల్‌సీమ్స్ కారణంతో ఎస్ఎంఎస్ పనులు ఆగిపోవడం, ఆపై గని అంతర్భాగంలో బుంగ ఏర్పడడం వంటి కారణాలతో నిర్దేశిత లక్ష్యాలకు చేరువగా ఉత్పత్తి నమోదవుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే లక్ష టన్నుల లక్ష్యానికి మించి అదనంగా 41వేల టన్నులు ఉత్పత్తి సాధించారు. ప్రస్తుతం అధికారుల ప్రత్యేక దృష్టితో ఉత్పత్తి లక్ష్యాలు క్రమక్రమంగా పెంచుతూ ఈ ఏడాది 2.10లక్షల టన్నులుగా నిర్దేశించారు. అయితే, డిసెంబర్, జనవరిలో బుంగ ప్రభావం చూపినా, ప్రస్తుతం రోజుకు 500 టన్నుల బొగ్గు వెలికితీస్తున్నారు. దీంతో లక్ష్యంలో 1.60లక్షల టన్నుల మేర నమోదయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. కాగా, మరో ఇరవై ఏళ్ల భవిష్యత్ ఉన్న కేపీయూజీలో మైన్ రైడింగ్ అందుబాటులోకి రానుండడంపై కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి...



త్వరలోనే మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. తద్వారా గనిలో ఉత్పత్తి సామర్థ్యం పెరిగి లక్ష్య సాధన సులువవుతుంది. ఇక భూగర్భ గనిలో నీరు ఉబికిరావడం సాధారణమే అయినా బయటకు పంపింగ్ చేస్తూ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూస్తున్నాం. – దుర్గం రాంచందర్, ఏరియా జీఎం